# తొలి అక్షరం

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక


ఎడిటర్: సాయి కృష్ణ, సంపుటి : 01 సంచిక - 236 పేజీలు - 6 గురువారం 18 జూలై 2024



## విలేకరులు కావలెను

తొలి అక్షరం తెలుగు దిన పత్రిక

వినూత్నంగా వెలువడుతూ, విశేష ప్రజాధరణ పొందుతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రికకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో విలేకరులు కావలెను.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tholiaksharam@gmail.comకి మెయిల్ చేయగలరు. సీనియర్లకు పాధ్రాన్యం, కొత్తవారికి కూడా అవకాశం,నియామకాలు జరుగుతున్నాయి వెంటనే సంప్రదించండి.

# నేడే రూ.1 లక్ష రైతు రుణమాఫీ..

## - నా జీవితంలో మర్చిపోలేని రోజు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:**


రైతులకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతగా నేడే రూ.1 లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నామని, ఇది తన జీవితంలో మరిచిపోలేని రోజు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.ప్రజాభవన్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో భేటీ నేపథ్యంలో బుధవారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా కేసీర్ రూ.28 వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారన్నారు. ఆగస్ట్ 15లోగా రైతు రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పామన్నారు. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పారని ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారని తెలిపారు. అయినప్పటికీ రుణమాఫీ చేస్తున్నామని స్పష్టం చేశారు.

# వీధి కుక్కలు దాడిలో బాలుడి మృతి ఘటన కలచివేసింది:సిఎం రేవంత్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:** జవహర్ నగర్‌లో వీధి కుక్కలు దాడి చేసి రెండేళ్ల బాలుడిని చంపేసిన ఘటనపై ముఖ్య మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలిచివేసిందని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరుగుతున్న ఒదున వీధి కుక్కల బెడదను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. వీధి కుక్కల బెడద ఉన్న ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి కాల్ సెంటర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పసి కందులు, చిన్నారులపై ఏటా వీధి కుక్క దాడులకు వాతావరణ పరిస్థితులా లేక సీజన్ కారణాలు అనే అంశంపై అధ్యయనానికి పశు వైద్యులు, బ్లూ క్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిపుణుల


మిగతా 2లో.



## ముగిసిన చంద్రబాబు ఢిల్లీ పర్యటన

**తొలి అక్షరం/ఢిల్లీ,జులై17:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుఢిల్లీ పర్యటన ముగిసింది. నిన్న సాయంత్రం ఆయన ఢిల్లీకి వెళ్లారు. రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు.ఇక ఇవాళ ఉదయం సీఎం అధికారిక నివాసం(1, జన్‌పథ్)లో పూజలు నిర్వహించారు. అనంతరం విజయవాడకు చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్థ నిర్వహణ, అవినీతి కారణంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని చంద్రబాబు తెలిపారు.2019–24 ఆర్థిక సంవత్సరాల మధ్య మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పి, అస్థిరమైన అప్పులను

మిగతా 2లో.



## భారీ ఎన్‌కౌంటర్...

### - 12 మంది మావోయిస్టులు మృతి

**తొలి అక్షరం/గచ్చిరోలి,జులై17:** మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు.చత్తీస్గఢ్ సరిహద్దులోని వండోలి గ్రామం సమీపంలో 12 నుంచి 15మంది మావోయిస్టులు ఉన్నారని సమాచారం అందడంతో ఉదయం 10గంటల సమయంలో డిప్యూటీ ఎస్పీ సారథ్యంలో పోలీసులు ఆపరేషన్ చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య మధ్యాహ్నం మొదలైన భీకర కాల్పులు సాయంత్రం వరకు కొనసాగాయని పోలీసు అధికారులు తెలిపారు. దాదాపు ఆరు గంటల పాటు కాల్పులు జరగాయి. 12మంది మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. అలాగే, మూడు ఏకే 47 తుపాకీలతో పాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోం: హరీశ్‌రావు



**తొలి అక్షరం/పటాన్‌చెరు,జులై17:** పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోమని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరులో నిర్వహించిన భారాస కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టులో పోరాడుతున్నామని, ఆ నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందన్నారు. 2001లో కేసీఆర్ ఉద్యమాన్ని పిడికెడు మందితో ప్రారంభించారని.. అప్పుడు కూడా కుట్రలు జరిగాయని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ పార్టీకి చెందిన 12మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్నారన్నారు. కానీ, కుట్రలు ఫలించలేదని, న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ 14 ఏళ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

వివరాలు 2లో

# తెలంగాణకు భారీ వర్ష సూచన..

### - ఆరెంజ్ అలెర్ట్ జారీ

**తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:** తెలంగాణకు భారీ వర్ష సూచన చేసింది భారత వాతావరణ శాఖ. రాబోయే రెండు రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం తెలిపింది.పలు జిల్లాల్లో 11-20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలో వర్షాలు పడనున్న ఈక్రమంలో ఆయా జిల్లాల అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అలెర్ట్ చేసింది.





## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు..

**తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:** తెలంగాణ సీఎస్, సాధారణ పరిపాలన విభాగం కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీఎం, మినిస్టర్స్‌కు చెల్లిస్తున్న వేతనాలకు సంబం ధించి ట్యాక్స్‌ను ప్రభుత్వం చెల్లించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, జస్టిస్ జె.అనిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపి ప్రతివాదులుగా ఉన్న సీఎస్, జీఏడీ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ఆదాయపన్ను పరిధిలోకి వచ్చే ప్రజల మాదిరే సీఎం, మంత్రులు పన్ను చెల్లించాల్సి ఉందని.. అయితే గవర్నమెంట్ చెల్లించడం ఏంటని సుపరిపాలనా వేదిక కార్యదర్శి శ్రీనివాస రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సీఎస్, జీఏడీ సెక్రటరీ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది.

# ప్రైవేటు 'కోటా'పై దుమారం..

## కర్ణాటక ప్రభుత్వం వెనకడుగు!



**తొలి అక్షరం/బెంగళూరు,జులై17:**

కర్ణాటకలోని ప్రైవేటు సంస్థల్లో గ్రూప్ సీ, డీ గ్రేడ్ పోస్టుల్లో కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై ప్రభుత్వం వెనకడుగు వేసింది.పరిశ్రమవర్గాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో బిల్లును తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. దీనిపై రానున్న రోజుల్లో సమీక్షించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.కన్నడవాసుల కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కర్ణాటక డిఫెన్స్ ఫోరమ్ అధ్యక్షుడు టీఏ నారాయణ గౌడ అభినందించినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంతకుముందు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కార్మిక మంత్రిత్వశాఖ స్పష్టత ఇచ్చింది. ప్రైవేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ కోటాలో 70 శాతం, మేనేజ్‌మెంట్ కోటాలో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని తాము చెప్పినట్లు వెల్లడించింది. ఇలా ప్రైవేటు కోటా అంశం తీవ్ర చర్చనీయాంశమైన నేపథ్యంలో ఆ బిల్లును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తాజా ప్రకటన వెలువడింది.

## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారద



తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా మహిళా హక్కుల కార్యకర్త నేరెళ్ల శారద బుద్ధ భవన్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క నేరెళ్ళ శారదకి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. తొలి ఏకాదశి పండుగ శుభ సందర్భంగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జూలై 12న విడుదల చేసిన జీవోలో కమిషన్‌లో సభ్యురాలిగా ఉన్న శారదను ఆమెకు ముందున్న సునీతా లక్ష్మారెడ్డి రాజీనామాసమర్పించడంతో చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. సునీతా లక్ష్మా రెడ్డి 2021 జనవరి 8న మహిళా కమిషన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె పదవీకాలం సాధారణంగా జనవరి 7, 2026 వరకు ఉంది. కానీ తన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొంటూ ఆమె పదవికి రాజీనామా చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి,ఎమ్మెల్యే దానం నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసుల ఆత్మ బంధువు సీతక్క' పుస్తకావిష్కరణ



తొలి అక్షరం/హైదరాబాద్, జులై17: యువ సాహిత్య రత్న, ప్రముఖ సామాజిక రచయిత కడియాల సురేష్ కుమార్ రాసిన 'ఆది వాసుల ఆత్మ బంధువు సీతక్క' అనే పుస్తకాన్ని ప్రజా భవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క బుధవారం ఆవిష్కరించారు. సీతక్క మాట్లాడుతూ తన జీవిత చరిత్రపై పుస్తకం రాసిన రచయిత సురేష్ కుమార్‌ను అభినందించారు. స్వశక్తితో ఎదిగిన ములుగు వాసి సురేష్ మంచి రచయితగా గుర్తింపు పొందాలని సీతక్క ఆకాంక్షించారు.

## వీధి కుక్కలు దాడిలో బాలుడి మృతి ఘటన కలచివేసింది:సిఎం రేవంత్‌రెడ్డి


(మొదటి పేజీ తరువాయి)

కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. వీధి కుక్కలకు టీకాలు వేయటం లేదా ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. జిహెచ్‌ఎంసి పరిధి లోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో కుక్కలు దాడులు చేస్తే తక్షణం అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్య శాఖను సిఎం ఆదేశించారు. ఇలాంటి సంఘటనలను నివారించ దానికి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని బస్తీలు, కాలనీలు, సంబంధిత వార్డు కమిటీల సహకారం తీసుకోవాలని జిహెచ్‌ఎంసి, మున్సిపల్ అధికారులను సిఎం అప్రమత్తం చేశారు.

## ముగిసిన చంద్రబాబు ఢిల్లీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

వివరిస్తూ విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాలను అమిత్ షాకు వివరించానని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏపీలో ఎన్డీఏకు అనుకూలంగా తీర్పునిచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెడతాయని చంద్రబాబు ట్వీట్ చేశారు. పర్యటనలో సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కే. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు.కాగా.. జన్‌పథ్ నివాసంలో చంద్రబాబును బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కలిశారు. అనంతరం చంద్రబాబు తన పర్యటన ముగించుకుని విజయవాడకు బయలుదేరారు. అయితే చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సైతం కలుస్తారంటూ వార్తలు వచ్చాయి. నిర్మలతో భేటీ ఏమీ లేదని అధికారులు వెల్లడించారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన కేవలం కొన్ని గంటలు మాత్రమే సాగింది.



# రాష్ట్రంలో 'సనోఫీ' లైఫ్ సైన్సెస్ రూ.3658 కోట్ల పెట్టుబడులు

తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చింది. సనోఫి లైఫ్ సైన్సెస్ సంస్థ 3,658కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. రాయదుర్గంలో సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'సనోఫి' లైఫ్ సైన్సెస్ సంస్థ తన గ్లోబల్ సామర్థ్య విస్తరణపై వచ్చే ఆరేళ్లలో రూ.3,658 కోట్ల పెట్టుబడులు పెట్టనుందన్నారు. వచ్చే ఏడాది కాలంలో రూ.914 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు జరుగుతాయని తెలిపారు. దీంతో



వచ్చే రెండేళ్లలో 2,600 కొత్త ఉద్యోగాలు వస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో వ్యాక్సిన్ ను ప్రవేశపెట్టిన మొదటి ఫార్మా కంపెనీగా సనోఫికి పేరుందన్నారు.సనోఫి విస్తరణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతుందని మంత్రి వెల్లడించారు. బహుళజాతి ఔషధ కంపెనీల ఏర్పాటుకు, సామర్థ్య వృద్ధికి తమ ప్రభుత్వం అనుకూల వాతావరణం కల్పించిందని మంత్రి తెలిపారు. కంపెనీకి ప్రభుత్వం తరపున సహాయసహకారాలు అందజేస్తామన్నారు.

# రైతు క్లస్టర్లలో సంబరాలు చేయాలి

తొలి అక్షరం/హైదరాబాద్, జులై17: రుణమాఫీ మొదలు కానున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు క్లస్టర్లలో సంబురాలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు ఇచ్చారు.బుధవారం ఆయన ప్రజా భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. రైతుల కళ్లల్లో ఆనందం చూసి ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవ్వాలని కోరారు. భారతదేశ చరిత్రలోనే ఒక రాష్ట్ర ప్రభుత్వం గా రెండు లక్షల రూపాయలు రుణమాఫీని ఒకేసారి చేయడం ఇదే మొదటి సారి అన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ నిర్ణయంలో కేబినెట్ మంత్రిగా తాను ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. తానూ ఒక రైతు బిడ్డని అని, రుణమాఫీతో రైతు జీవితంలో ఆనందం గడియలు మొదలు కానున్నాయని చెప్పారు. అవగాహన లేని ప్రతిపక్షాలు మంచి చేసినా, విమర్శిస్తూనే ఉంటాయన్నారు. లక్ష రూపాయల లోపు ఉన్న వాళ్లందరికీ గురువారం నుంచి ఒకేసారి జమ అవుతాయన్నారు.ఈ నెల చివరి వారంలో లక్షా 50 వేల రూపాయల వరకు ఉన్నోళ్లందరికీ జమ అవుతాయన్నారు. ఆగస్టు లోపు మిగతా 2 లక్షల రుణమాఫీ ఉన్నోళ్లకు మాఫీ చేస్తామన్నారు. ఒకేసారి రైతు పేరు మీద ఉన్న రుణాన్ని 3 పద్ధతుల్లో మాఫీ చేయబోతున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ, రైతు చిరునవ్వు కోసం ఇంత గొప్ప నిర్ణయం తీసుకుంటే ప్రసంసించాల్సింది పోయి విమర్శలు చేయడం ప్రతిపక్షాల కుహన బుద్ధి రాజకీయం అర్థం అవుతుందన్నారు. 2005లో దేశవ్యాప్తంగా రూ. 72,000 కోట్ల రూపాయలు మాఫీ చేస్తే, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కోసం రూ. 31 వేల కోట్లను ఖర్చు చేస్తుందన్నారు. ఏడు లక్షల కోట్లు అప్పు ఉన్నా, ఇచ్చిన మాటను నెరవేర్చామన్నారు. హరీష్?రావు, కేటీఆర్‌లు ప్రశంసించ పోయినా పర్వలేదని, కానీ



రైతు మంచి కోసం చేసే కార్యక్రమంపై విమర్శలు చేయడం తగదని సూచించారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోం: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

భారాస పని అయిపోయిందన్నవాళ్లు తర్వాత కనిపించకుండా పోయారు. పార్టీకి కష్టాలు వస్తాయి. ఎమ్మెల్యే పోతే పార్టీ పోదు. పటాన్‌చెరులో మంచి కార్యకర్తలు ఉన్నారు. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే. మీరందరూ కష్టపడితేనే మహిపాల్ రెడ్డి గెలిచారు. పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చాం. రోడ్లు, తాగునీరు, స్టేడియం వంటివి ఎన్నో అందించాం. నిధుల వరద పారించాం. గూడెం పోయినా గుండె ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్ ఇప్పుడు ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారు. జీవోలో రేషన్ కార్డు ఆధారంగా రైతు రుణమాఫీ అని చెప్పారు. మళ్లీ వ్యతిరేకత వస్తోందని మాట మార్చుతున్నారు. పాస్‌బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటతో చెబుతున్నారు. అదే నిజమైతే జీవో మార్చాలి. వడ్లకు బోనస్ అన్నారు.. తర్వాత సన్నవడ్లకే బోనస్ అంటూ 90 శాతం రైతులకు బోనస్ ఎగ్గొట్టారు. ఇప్పుడు రుణ మాఫీ విషయంలోనూ అదే చేస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ సరిగ్గా అమలు కాలేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

## కెసిఆర్ లాగా రైతులను మభ్యపెట్టడం లేదు: సిఎం రేవంత్ రెడ్డి



తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:రుణమాఫీ పేరుతో కెసిఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, అందుకే ఏకమొత్తంలో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే రూ.2 లక్షల రైతు రుణమాఫీ అని ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ శ్రేణులకు వివరించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండని, దీనిపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని అన్నారు.

# సాగర్ కుడికాలువకు నీటివిడుదల

తొలి అక్షరం/హైదరాబాద్, జులై17: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు ఏపిలో తాగు నీటి అవసరాల నిమిత్తం బుధవారం నాడు నీటిని విడుదల చేశారు. సాగర్ కుడి కాలువ 5,7 నంబర్ గేట్ల ద్వారా 2000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 9 రోజుల పాటు 4.5 టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం ఈ నీటితో చెరువులు నింపనున్నట్లు సమాచారం. ఈ నీటిని వృధా చేయరాదని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## నేను ఆరోగ్యంగానే ఉన్నా : ఆర్.నారాయణ మూర్తి



తొలి అక్షరం/హైదరాబాద్, జులై17: సినీరంగంలో పీపుల్ స్టార్ గా పేరొందిన దర్శక నటుడు, నిర్మాత ఆర్ నారాయణ మూర్తి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో ఆర్ నారాయణమూర్తికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయగా ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్లు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ప్రసాద్ ల్యాబ్స్ లో ఆర్ నారాయణమూర్తి ఓ ప్రెస్ మీట్ కు హాజరయ్యారు.ఆ ప్రెస్ మీట్‌లో నారాయణమూర్తి ఏమీ మాట్లాడలేకపోయారు. తనకు చాలా నీరసంగా ఉందని కళ్లు తిరుగుతున్నాయని నారాయణమూర్తి చెప్పారు. దీంతో ఆయన పక్కనే ఉన్నవారు నారాయణమూర్తిని వెంటనే నిమ్స్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. నారాయణమూర్తికి 2 నెలల క్రితమే గుండెకు బైపాస్ సర్జరీ జరిగింది. గుండె నాళాల్లో బ్లాకులు ఉండటంతో బైపాస్ సర్జరీ చేశారు. అప్పటి నుంచి గతంతో పోల్చితే కాస్త మెత్తగానే ఉంటున్నారు.**నేను ఆరోగ్యంగానే ఉన్నాను:ఆర్.నారాయణ మూర్తి...** నేను ఆరోగ్యంగానే ఉన్నాను. నా ఆరోగ్యం గురించి అభిమానులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్.నారాయణ మూర్తి తెలిపారు. తాను నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. దేవుడి దయవల్ల బాగానే కోలుకుంటున్నానని ఆయన తెలిపారు.ప్రముఖ నటుడు ఆర్. నారాయణ మూర్తి ఆరోగ్య పరిస్థితిపై నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చర్చించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని నిమ్స్ డైరెక్టర్ మంత్రికి వెల్లడించారు . వైద్య పరమైన టెస్టులను చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల బృందంచే ప్రజానటుడు నారాయణ మూర్తికి మెరుగైన చికిత్సను అందించాలని మంత్రి రాజనర్సింహ నిమ్స్ డైరెక్టర్ కు ఆదేశించారు.

# ఖాతాదారులను మోసం చేసిన బ్యాంక్ మేనేజర్

తొలి అక్షరం/హైదరాబాద్, జులై17:ఖాతాదారులను మోసం చేసి ఓ బ్యాంక్ మేనేజర్ లక్షల్లో కొల్లగొట్టిన ఉదంతం వెలుగు చూసింది. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఇద్దరు ఖాతాదారులను ఈ విధంగా మోసం చేసినట్లు తెలిసింది. సదరు ఖాతాదారులకు లోన్ శాంక్షన్ చేస్తానని చెప్పి వారి వద్ద నుంచి బ్లాంక్ చెక్కులు తీసుకున్నాడని, అనంతరం లోన్లు శాంక్షన్లు చేసి కస్టమర్లు ఇచ్చిన బ్లాంక్ చెక్కుల ద్వారా డ్రా చేసుకున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పోలీసులు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. అయితే సదరు బ్యాంక్ మేనేజర్ పరారీలో ఉన్నాడని తెలిసింది. ఈ విషయమై ఇద్దరు ఖాతాదారులలో ఒకరు నిజామాబాద్ నాల్గవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. సదరు ఖాతాదారుడు అకౌంట్ నుంచి బ్యాంక్ మేనేజర్ రూ.20 లక్షలు స్వాహా చేసినట్లు టౌన్ సిఐ నరహరి వెల్లడించారు. నిజామాబాద్ నగరానికి చెందిన కావేరీ ట్రేడర్స్ యజమాని పుల్లూరి రాకేష్ శివాజీనగర్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో వ్యాపార నిమిత్తం రుణం కోసం దర ఖాస్తు చేసు కున్నారు. ఇందుకు సంబంధించి సదరు వ్యాపారి సిసి లోనుగా దరఖాస్తు చేసుకున్నాడు. రుణం కోసం వ్యాపారి బ్యాంకుకు వెళ్లగా రూ.20 లక్షల రూపాయల ఖాతాదారుడి చెక్కులను బ్యాంకు మేనేజర్ అజయ్ నగదు రూపంలో మార్చుకుని కాజేసినట్లు గుర్తించారు. వెంటనే బాధితుడు నాల్గవ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పరారీలో ఉన్న బ్యాంకు మేనేజర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బ్యాంక్ మేనేజర్ దొరికితే ఈ కేసులో ఇద్దరు బాధితులేనా? ఇంకెవరైనా బాధితులు ఉండే అవకాశం ఉందా? అనేదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

Union Bank of India

# గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్క విజేందర్ నియామకం



తొలి అక్షరం/చెన్నారావుపేట,జూలై17: చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు లక్క విజేందర్ ని చెన్నారావుపేట గ్రామ కాంగ్రెస్ కార్య నిర్వాహక అధ్యక్షులుగా ఎన్నుకున్నట్టు లక్క విజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా లక్క విజేందర్ మాట్లాడుతూ...తనపై నమ్మకంతో గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం ఇచ్చిన నర్సంపేట శాసనసభ్యులు మాధవ రెడ్డికి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్యగౌడ్‌కి చెన్నరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్‌కి మండల కమిటీ నాయకు లకు గ్రామ కమిటీ నాయకులకు యువజన కాంగ్రెస్ నాయకు లకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలియజేశారు.

# మెస్,కాస్మోటిక్ చార్జీలను పెంచాలి

**- సంక్షేమ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలను కల్పించాలి - మండల కార్యదర్శి భానోత్ వినోద్ కుమార్**




తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),జూలై17: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నెక్కొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్నటు వంటి ఎస్టి హాస్టల్ ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఎస్ఎఫ్ఐ నెక్కొండ మండల కార్యదర్శి బానోత్ వినోద్ కుమార్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వినోద్ కుమార్ భానోత్ మాట్లాడుతూ..విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అదేవిధంగా హాస్టలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ కూడా విద్యార్థులకు దోమ తెరలు బెడ్ షీట్లు,తదితర వస్తువులు అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.దాంతోపాటు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల ఎస్ఎఫ్ఐ నాయకులు దేవేందర్,కళ్యాణ్,నితిన్,మరి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థపై అవగాహన ప్రతి పౌరుడి బాధ్యత

**- చట్టాలు తెలుసుకో-న్యాయం చేకూర్చుకో**

**- గాడిపెల్లి గణేష్ గౌడ్ (ఎల్ఎల్బి)**




తొలి అక్షరం/ నర్సింహులపేట, జూలై17: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా గాడిపెల్లి గణేష్ గౌడ్ ( న్యాయ విద్యార్థి ) దాని ప్రాముఖ్యతపై కింది విధంగా వివరిస్తూ, పౌరులను పలు సూచనలు ఇవ్వడం జరిగింది.రోమ్ శాసనాన్ని ఆమోదించిన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 17న అంతర్జాతీయ న్యాయం కోసం ప్రపంచ దినోత్సవాన్ని జరుపుకుంటారని.రోమ్ శాసనం అనేది జూలై 17, 1998న అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐ. సి. సి)ని స్థాపించిన ఒప్పందం.ఈ కోర్టు మౌలికమైన విధి ఏమిటి అంటే వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలపై, సమస్యలపై, మానవ హక్కుల భంగంపై ఇతర మౌలికమైన అంశాలపై ప్రపంచ దేశాలు ఇట్టి కోర్టును ఆశ్రయించగా వాటి పరిష్కారంకై విధులు నిర్వర్తిస్తుంది.ఈ సందర్భంగా ప్రతి పౌరుడుకి తెలియజేసేది ఏమిటంటే తమ దేశంలోని న్యాయవ్యవస్థపై అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ పై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ముఖ్యంగా ప్రతి పౌరుడికి తమ దేశంలో ఉన్నటువంటి న్యాయ వ్యవస్థపై,చట్టాలపై అవగాహన లేకపోతే పౌరుడికి ఉన్న హక్కులు, అధికారాలు, సదుపాయాలు,రాజ్యాంగ రక్షణలకు భంగం కలిగినప్పుడు నిరాశితుడైతాడు,కావున ప్రతి పౌరుడు దేశ న్యాయ వ్యవస్థ పై,దేశ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, అట్టి అవగాహన సమసమాజ నిర్మాణానికై ఎప్పుడు తోడ్పడుతూ ఉండాలని ఈ సందర్భంగా పౌరులకు చెప్పుకొచ్చారు.

# సింగరేణి ఓసీ గనుల్లో భారీగా చేరిన నీరు

తొలి అక్షరం/భూపాలపల్లి,జూలై 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో సింగరేణి ఉపరితల బొగ్గు గనుల్లో భారీగా నీరు, మట్టి చేరి ఉత్పత్తికి అంతరాయం కలిగినట్లు అధికారులు తెలిపారు. భూపాలపల్లి ఓసీ-2, 3 గనుల్లో 6 వేల టన్నులు, తాడిచర్ల ఓసీలో 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని, దాదాపు సింగరేణికి రూ. కోటి వరకు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. కాగా, వర్షాలు తగ్గు ముఖం పట్టిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు.**అన్నారం బరాజ్ వద్ద నిలిచిన పరీక్షలు...**మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో అన్నారం (సరస్వతి) బరాజ్ అప్ స్ట్రీమ్‌లో చేపట్టిన రెండో దశ జియో ఫిజికల్ పరీక్షలు బుధవారం నిలిచిపోయాయి. 29, 30వ గేట్ వద్ద పుణె నుంచి వచ్చిన సీడబ్ల్యూపీఆర్ఎస్ రెండో బృందం వారం రోజులుగా బోర్ వెల్ వేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాన తగ్గుముఖం పట్టిన తర్వాత మళ్లీ పరీక్షలు చేపడతామని ఇంజినీర్లు తెలిపారు.



# కాంగ్రెస్‌ది రైతు పక్షపాత ప్రభుత్వం

**- రైతులకు కళ్ళలో వెలుగులు నింపేందుకే రైతు రుణమాఫీ - 18న లక్ష రూపాయల వరకు రుణమాఫీ పై హర్షం - జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు పల్ల మాలతి రెడ్డి**



తొలి అక్షరం/నర్సింహులపేట,జూలై17: కాంగ్రెస్‌ది రైతు పక్షపాత ప్రభుత్వమని,రైతులకు కళ్ళలో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు పల్ల మాలతి రెడ్డి అన్నారు.బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ పై నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని,అందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆమె పేర్కొన్నారు.ఈ నెల 18వ తేదీ నుంచి లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్న రైతులకు సాయంత్రం 4 గంటలకు రూ.7వేల కోట్ల రుణమాఫీ రైతుల ఖాతాల్లోకి వెళుతుందని సీఎం స్పష్టం చేశారని ఆమె తెలిపారు. మాట ఇస్తే నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, తెలంగాణ ఇస్తానన్న హామీని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ నిలబెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు.2022 మే 6న వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారని వారి మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ సిద్ధమైందన్నారు. రైతు సంక్షేమం కోసం కృషి చేసే ప్రభుత్వం తమదని చెప్పుకొచ్చారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన రుణమాఫీ కేవలం రూ.28 వేల కోట్లని, 38 వేల కోట్లతో అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే తాము రుణమాఫీ ప్రకటించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మన్నారు. పారదర్శకంగా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తామని.. ముందుగా నేటి నుంచి లక్ష రూపాయల కలిగిన రైతులకు రైతు రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారని గుర్తు చేశారు. రైతుల కళ్ళల్లో వెలుగులు నింపడమే కాకుండా వ్యవసాయం అంటే దండగ కాదు పండగ అని కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపిస్తుందని కొనియాడారు.మంత్రులు సీతక్క, శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, డిసిసి అధ్యక్షులు భరత్ చంద్ర రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.మురళి నాయక్, సీనియర్ కాంగ్రెస్ నేతలకు మహబూబాబాద్ జిల్లాలోని రైతుల పక్షాన ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీల సమగ్ర కుల గణన యాత్రను విజయవంతం చేయాలి



తొలి అక్షరం/ చెన్నారావుపేట (నర్సంపేట) జూలై17: రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి బిసి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు ఉద్యమం కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ డేగల శ్రీనివాస్ అన్నారు.బుధవారం నర్సంపేట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల కు ముందు కామా రెడ్డి సభలో సమగ్ర కులగన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు.ఆ హామీని గుర్తు చేయడానికి బీసీ డిక్ల రేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 17 రోజుల పాటు చేపట్టిన సమగ్ర కుల గణన యాత్రలో భాగంగా ఈనెల 18న వరంగల్ హంటర్ రోడ్ లోని సత్యం కన్వెన్షన్ హాల్ లో సమగ్రకుల గణన యాత్ర సభ నిర్వహించడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు. ఈ సభకు వరంగల్ జిల్లాతో పాటు నర్సంపేట నియోజకవర్గం వ్యాప్తంగా బీసీ కులాలకు చెందిన వారు కులాలకు అతీతంగా పార్టీలక తీతంగా ఏకమై సమగ్ర కుల గణన సాధన యాత్ర సభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని డ్యాగల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చెన్నూరి రవి,ఓడపల్లి రమేష్,బేతి భాస్కర్,శీరంశెట్టి రాజేందర్,మద్రి క్రాంతి, బ్రహ్మచారి,యాట మోహన్,నీల సుధాకర్,కొలిపాక సుధాకర్,గొర్రె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నిలయంలో ప్లాటు ఉంటే భవిష్యత్తుకు భరోసా

**- సకల సౌకర్యాలతో అందుబాటు ధరల్లో మన మరిపెడలో**



తొలి అక్షరం/మరిపెడ,జూలై17: మానుకోట జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినం రోజు శ్రీ నిలయం డవలపర్స్ వారి ఓపెన్ ప్లాట్స్ బ్రోచర్ లాంచింగ్ మార్కెటింగ్ మిత్రులు,కస్టమర్ల సమక్షంలో శ్రీ నిలయం ల్యాండ్ ఓనర్ ఆనబత్తుల ఉపేందర్,ఆనబత్తుల వీరన్న,నరసింహారావు,రమేష్ లు బ్రోచర్ లాంచింగ్ చేశారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ...మరిపెడ పట్టణం మేటి పట్టణాలకు దీటుగా దిన దిన అభివృద్ధి చెందుతున్న తరుణంలో,మరిపెడ పట్టణం మూడు జిల్లాలకు కూడలిగా,మండల కేంద్రంగా ఉండి వ్యాపార వాణిజ్య రంఘంలో జెట్ స్పీడుతో దూసుకెళుతున్న పట్టణ పరిధి మరిపెడలో నూతనంగా శ్రీ నిలయం డవలపర్స్ వారి ఆధ్వర్యంలో శ్రీ నిలయం ఓపెన్ ప్లాట్లు అందుబాటులోకి తెచ్చారు.ప్రతి పేదవారు ఒక ఇంటివారు కావాలనే ఉద్దేశంతో, పేదవారి ఇంటికల నిజం కావాలని,పేదవారు కూడా కొనగలిగే అతి తక్కువ ధరల్లో డిజైన్ చేసి,అన్ని హంగులతో డిటిసిపి ఓపెన్ ప్లాట్లు డాంబర్ రోడ్లు,హెూపన్ డ్రైనేజీ,100,166 గజాల్లో పెదవారికి,ముందు చూపుతో పెట్టుబడి పెట్టే కస్టమర్ దేవుళ్ళకు అందుబాటులో ఉండేలా ప్రతి పేదవారు మా సంస్థలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్లాట్లు డిజైన్ చేశామని సంస్థ యాజమాన్యం తెలియచేశారు.ఇదే కాదు ఇకముందు మేము చేసే డవల్మెంట్ లు అన్ని కూడా ప్రతిఒక్కరికీ అందుబాటులో ధరలు ఉండేలా మాసంస్థ ప్లాట్లు డిజైన్ చేయడం జరుగుతుందన్నారు.తక్కువ లాభాలతో ఎక్కువ ప్లాట్లు తక్కువ ధరల్లో అందించి కస్టమర్ల ప్రేమాభిమానం పొందేలా మా ప్లాట్ల డిజైన్ ఉంటుందన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక మొహరం పండుగ

తొలి అక్షరం/తొర్రూర్ రూరల్,జూలై17: తొర్రూర్ మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా మొహరం పండుగను ముస్లిం సోదరులు నిర్వహించడం జరిగింది.పట్టణ కేంద్రంలోనీ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఉన్నటువంటి పీరిల దేవాలయంలో మండలంలోని గుర్తురు గ్రామంలోనీ స్థానిక పీర్ల దేవాలయంలో పీరీలను ఘనంగా ముస్తాబు చేసి దప్పు సప్పులతో పురవీధులలో పీరిలను ఊరేగింపు నిర్వహిస్తూ ఘనంగా మొహరం పండుగను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మహమ్మద్ షబ్బీర్ అలీ,మహమ్మద్ జలీల్,మహమ్మద్ అమీర్ ల్లు సంయుక్తంగా మాట్లాడుతూ...హిందూ ముస్లింల ఐక్యతకు పీర్ల పండగ చిహ్నమని తెలుపుతూ ఇరు తెలుగు రాష్ట్రాలతో పాట ప్రపంచం మొత్తం మొహరం పండుగను ఘనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొంటూ ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలకు మొహరం పండుగ నుండే నూతన సంవత్సరం మొదలవుతుందని నేల వంక కనిపించిన రోజు నుండి పది రోజుల వరకు మొహరం పండుగను నిర్వహించడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మొహరం పండుగను గుర్తించి ప్రభుత్వం నుండి నిధులను కేటాయించి ముస్లిం సోదరులను ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.గుర్తురు గ్రామంలో మొహరం సందర్భంగా స్థానికులు వేసిన వేషధారణ పలువురు చూపరులకు ఆనందాన్ని ఇచ్చింది.ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఇస్లాం,జలగం స్వామి గౌడ్,సింగారం రాజు,సింగర్ కిరణ్,పంజాల రాజు, జంపాల సందీప్,పూస ఐలయ్య,పెందోట కిషన్, మహమ్మద్ రియాజ్,ముత్యం రాజు,ఎండి.యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూర్ పట్టణంలో ఆషాడమాసం వనభోజనాల సందడి

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),జూలై17: తొర్రూర్ పట్టణ కేంద్రంలోని ఆషాడమాసంలో వనభోజనాల సందడి సందర్భంగా బుధవారం నేషనల్ బేడ(బుడగ)జంగం రిజర్వేషన్ పోరాట సమాఖ్య సంఘం తొర్రూర్ డివిజన్ యూత్ కన్వీనర్ నర్కుటి అబ్బస్వామి ఆధ్వర్యంలో వారితో పాటు వారి స్నేహితులు,కుటుంబ సమేతంగా వనభోజనానికి వెళ్లారు.అబ్బస్వామి ఆహ్వానం మేరకు వనభోజనాలకి తొలి అక్షరం తెలుగు దినపత్రిక రాష్ట్ర బ్యూరో పస్తం సాంబ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆనవాయితీగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించాలని అన్నారు.ప్రతి సంవత్సరం వనభోజనాలకి అందరూ కుటుంబ సమేతంగా వెళ్లాలని వనదేవత ఆశీస్సులు అందరి మీద ఉండాలని భగవంతుని కోరడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో భూతం నరసింహ,కొండపల్లి నారాయణ,ఈబుద్ధి కృష్ణ,నర్కుటి జంప,నర్కుటి సాయి ప్రకాష్,కిన్నెర జీవ సమ్మయ్య,పస్తం పుల్లయ్య, పస్తం వెంకటేశ్వర్లు,పస్తం గజనందు,నర్కుటి బద్రి,పస్తం ఉప్పయ్య,నర్కుటి కృష్ణ,మోటం వెంకన్న,తుర్పాటి కిక్, కొండపల్లి సమ్మయ్య,మోటం బొవాని,నర్కుటి వీరన్న, ఉర శివాజీ,కొండపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయంలో తిరుగులేని నాయకురాలు కొండ సురేఖ

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై17:రాజకీయంలో సమయానుకూలంగా సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆరితేరిన విశేష అనుభవం కలిగి ఎంచుకున్న నియోజకవర్గం అభ్యున్నతికి అబివృద్ధికి తోడ్పాటున అందిస్తూ పేద బడుగు బలహీన వర్గాలలోని ప్రజలను కష్టసుఖాల్లో నిస్వార్ధంగా పాలుపంచుకునే మనస్తత్వం కలిగిన కొండా సురేఖ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అనుకునేవారు లేకపోలేదు.ఉన్నది ఉన్నట్లు ముక్కుసూటిగా మాట్లాడే తత్వం కలిగిన కొండా సురేఖ రాజకీయ ప్రస్థానంలో అగ్రగామిగా ప్రత్యేక సముచిత స్థానంతో అన్ని వర్గాల ప్రజల ఆదరణ అభిమానులు పొందిన కొండా సురేఖ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలకు సుపరిచితం ప్రస్తుతం వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి గెలిచిన కొండ సురేఖ గతంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనిచేసిన అనుభవం ఉండటం ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ స్థానాన్ని సుస్థిరం చేసుకొని దేవదాయ అటవీశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

## పార్టీలకతీతంగా సామాజిక సేవలో కాంతిరేఖగా:

సమాజంలోని అన్ని వర్గాల వారితో సన్నిహితంగా ఉంటూ వారి కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా ఉన్నతమైన ప్రజాభిమానం కలిగిన నాయకురాలిగా బడుగు బలహీన వర్గాల కాంతిరేఖగా సురేఖ పేద మధ్యతరగతి కుటుంబాల అభివృద్ధితో పాటు అన్ని వర్గాల వారి అవసరాలకు అనుగుణంగా తమ కార్యాచరణతో శ్రమిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం పట్ల తాను గెలిచిన ప్రతి నియోజకవర్గ అభివృద్ధి పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్న కుండా సురేఖ అభినందనీయురాలే అని పలువురు చర్చించుకుంటున్నారు.

## రాజకీయంలో తిరుగులేని నాయకురాలుగా:

బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండ సురేఖ సమస్యలు ఎదురైనప్పుడు దీటుగా ఎదుర్కొనే సమయస్ఫూర్తి ఉన్న వ్యక్తిత్వంతో ప్రస్తుత ముందు తరాల వారికి స్ఫూర్తి ప్రదాతగా ప్రజాసేవలో పురోగమిస్తూ తన వంతు సహాయ సహకారాలు అందించడంలో సురేఖకు సాటి ఎవ్వరు లేరని అనుకునేవారు కోకోల్లలు ప్రభుత్వాలు మారుతున్న కాలగమనంలో మార్పులు చేర్పులు వస్తున్న రాజకీయాలకు అనుగుణంగా రాజకీయ ప్రస్థానంలో రాజకీయ పార్టీలే సురేఖ చుట్టు తిరిగాయనే భిన్నవాదనలు లేకపో లేదు ఆత్మ అభిమానానికి ఆటంకం ఏర్పడితే వ్యక్తిగతంగా ఏ పార్టీ అని చూడకుండా బయటికి వచ్చి తనను ఆదరించే పార్టీ తరపున ఎలక్షన్లో నిలబడిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అత్యధిక మెజారిటీతో గెలిచిన సందర్భాలు ఎక్కువ అపజయాలు చాలా తక్కువే.

## రాజకీయంలో అంచలంచెలుగా ఎదిగి:

ఒడిదుడుకులను తట్టుకుని నిలబడగల సామర్థ్యం కలిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ స్వతహాగా ఉన్నత విద్యావంతురాలు వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో మండల పరిషత్ ప్రెసిడెంట్‌గా అనుకోని పరిస్థితుల్లో అనేక మలుపుల మధ్య కొండా సురేఖ రాజకీయ ప్రస్తావన మొదలైందని అనుకుంటారు.ఇందుకు తన భాగస్వామి కొండ మురళీధర్ రావు మొదటి రాజకీయ గురువుగా అభివర్ణిస్తారు.నీతి నిజాయితీ గల వ్యక్తిత్వం తాను చెప్పదలుచుకున్నది కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం వాస్తవికతను ప్రతిబింబజేయడం ప్రజల సమస్యకే ప్రాథమిక నివ్వడం నిజాన్ని నిర్భయంగా చెప్పడం లాంటి విశేష నాయకత్వ లక్షణాలు ఉన్న కొండా సురేఖ రాజకీయాలు రాష్ట్ర రాజకీయ నాయకులను ప్రభావితం చేసిందని విభిన్న వాదనలు ఉన్నాయి క్రమంలో కొండ సురేఖ ఆవశ్యకతను గుర్తించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సురేఖ ఉంటే తమ పార్టీ బలోపేతం జరుగుతుందని నమ్మిన రాజకీయ నాయకులు కొండ సురేఖ నాయకత్వాన్ని బలపరిచినట్లు తెలుస్తుంది తదనంతరం పార్టీలో తమకంటూ ప్రత్యేక సంపాదించి రాజకీయంలోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం గమనారం.

## ప్రజల ఆదరాభిమానాలు ఎక్కువే:

సరైన రాజకీయనాయత్వ పటిమ కలిగిన కొండా సురేఖ ప్రజల



నుండి తిరుగులేని ఆధార అభిమానులకు పొంది శాయంపేట నియోజకవర్గం నుండి పరకాల నియోజకవర్గం నుండి వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి అనేక దఫాలుగా ఎమ్మెల్యేగా గెలు పొందడంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ లాంటి ఉన్నత స్థాయి మంత్రి పదవులు వరించాయి.అన్ని వర్గాల ప్రజలకు అత్యంత సన్నిహితంగా ఉండి సురేక తాను గెలిచిన నియోజకవర్గాల్లో ప్రజల సంక్షేమ అభివృద్ధి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో సహకారం అందించిందని చెబుతారు ఇప్పటికీ తాను ఎన్నుకోబడిన నియోజకవర్గం అభివృద్ధి జరిగిందంటే ఎక్కువ శాతం కొండా సురేఖ కాలం నాటి భాగస్వామ్యంమేనని చెప్తారు.రాజకీయ నాయకురాలుగా ప్రత్యర్థులలోనూ సొంత పార్టీలోనూ దాదాపుగా వ్యతిరేకత లేనంతగా రాణిస్తున్న కొండ సురేఖ భవిష్య తెలంగాణ రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నత విలువలు కలిగిన రాజకీయనాయకురాలిగాగుర్తింపు పొందుతుండడం విశేషం(దాడిశెట్టి )

# కాకతీయ విశ్వవిద్యాలయం నిరుద్యోగం పై నిరంతర పోరు

**- అధ్యక్షులు ఏబిఎస్ఎఫ్ కాకతీయ విశ్వవిద్యాలయం రచయిత దూడపాక నరేందర్**

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై17:తెలంగాణ ప్రాంతంలో పోరాటాలు కొత్త కాదు నిజానికి పోరాటాలకు పెట్టింది పేరు తెలంగాణ అని అంటారు. నీళ్లు,నిధులు నియామకాలు అంటూ పోరాటం చేసి తెలంగాణ తెచ్చుకున్న తర్వాత కూడా మళ్లీ తెలంగాణ ప్రాంతంలో ఏదో ఒక రూపంలో పోరాటాలు జరగడం చూస్తున్నాం ప్రత్యేక తెలంగాణ నినాదంలో ఒకటైన నియామకం తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత కూడా గత ప్రభుత్వంలోనూ నేటి నూతన ప్రభుత్వంలోనూ నిరుద్యోగ యువత ఒకరకంగా పోరాటాలు చేస్తుంది.రెండు ప్రభుత్వాలు నిరుద్యోగులను ఒకే రకంగా చూస్తున్నాయని చెప్పవచ్చు గత ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన మంత్రి గ్రూప్ వన్ అభ్యర్థి చనిపోతే చాలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం కలకలం రేపింది. అలాగే నేటి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి నిరుద్యోగ జేఏసీ నాయకుడు గురించి ఆయన పోరాటం గురించి బాధ్యతరాహిత్యంగా మాట్లాడారు.నిజానికి ఈ రెండు ప్రభుత్వాలే కాదు సమైక్య రాష్ట్రంలోనూ కూడా ఇలాంటి కోకొల్లలు కనిపిస్తాయి.విద్యార్థులు నిరుద్యోగులు తలుచుకుంటే ఏమైనా జరగవచ్చు. తెలంగాణ రావచ్చు ప్రభుత్వాలు పడవచ్చు అన్న ఆనాటి అధికారం లేని రాజకీయ నాయకులు నేడు అధికారం రాగానే వాళ్ల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదు.అనేది ఒక ప్రశ్న బహుశా విద్యార్థులు నిరుద్యోగులు సామర్థ్యం ఆనాటి నాయకుల్లాగే నేటి నాయకులు అంచనా తప్పు అయ్యి అలా అంటున్నారేమో గత ప్రభుత్వంలో ఉద్యోగాలకై కొట్లాడిన నిరుద్యోగులు నూతన ప్రభుత్వంలోనూ కొట్లాడుతున్నారు.అంటే పూర్తిగా రెండు ప్రభుత్వాలు వారిపై కపట ప్రేమ చూపిస్తున్నట్లేగా అయినా నిరుద్యోగులు కోరుతున్నది ఏమిటి



వారు ఇచ్చిన రాజకీయ వాగ్దానాలేగా ఎన్నికల ముందు ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ మెగా డీఎస్సీ గ్రూప్ వన్ గ్రూప్ టూ వారు ఇచ్చిన హామీలేగా మరి వాటి కై పోరాడుతున్న క్రమంలో ఏదో గొంతెమ్మ కోరికలు కోరినట్టు విద్యార్థులు మీద అభ్యర్థుల మీద విద్యార్థి సంఘాల మీద ఎందుకింత అణచివేత టెట్ రాసిన అభ్యర్థులు డీఎస్సీ రాసేందుకు సిలబస్ వేరుగా ఉంది.కాబట్టి మూడు నెలల సమయం అడుగుతున్నారు.నిజానికి వారు ఈ మెగా డీఎస్సీ కోసం కొన్ని సంవత్సరాలు ఎదురు చూశారు ఇంకో మూడు నెలలు ఇస్తే ఇస్తే వారు సంతృప్తిగా రాస్తారు.అంతేకానీ అంతేకానీ ప్రభుత్వంపై బురద జల్లాలు అనేది వారి ఉద్దేశం కానే కాదు.అలాగే గ్రూప్ వన్ అభ్యర్థులు ఎప్పటినుంచో పోరాడుతున్నారు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన 2011 లో వచ్చింది.దాని తర్వాత 2022 లో వచ్చిన అది రెండుసార్లు పేపర్ లీకేజ్ అలాగే బయోమెట్రిక్ లాంటి సమస్యలు వల్ల రద్దయి నిరుద్యోగుల జీవితాలపై నీళ్లు చల్లింది ఈ రకంగా చూసినట్లయితే గ్రూప్స్ అభ్యర్థులు 14 సంవత్సరాలుగా నిరంతర పోరు నిరుద్యోగంగా మారిపోయారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేటి ప్రభుత్వంలో ముఖ్యమైన మంత్రి గారు గ్రూప్ వన్ అభ్యర్థులను వర్ణిస్ట్ హండ్రెడ్ గా తీసుకోవాలని సూచించిన విషయం తెలిసిందే.అధికారంలోకి రాగానే వారు అదే విధంగా చేస్తారని ఆశించిన అభ్యర్థులు అలా జరగకపోవడంతోనే కాదా పోరాటాలు చేస్తున్నది.ఆ విషయాలను నాయకులు మరవకూడదు అనేది అభ్యర్థుల పోరాట ఫలితం ప్రజలకు అవసరమైన అనువైన పాలన అందిస్తాం ప్రజా పాలన అందిస్తాం అన్నట్లు నూతన ప్రభుత్వం ఆ విధంగానే అడుగులు వేసి అభ్యర్థులకు అలాగే విద్యార్థులకు రాష్ట్ర ప్రజల మండల పొందాలి అని కోరుకుందాం.

# రైతుల రుణమాఫీ సమావేశానికి హాజరైన మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్సీలు

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై17: నేడు ప్రజా భవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రుల సమక్షంలో ప్రారంభమైన రైతుల రుణమాఫీ మీద కాంగ్రెస్ నాయకుల సమావేశానికి హాజరైన మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్సీలు సహచర ఎమ్మెల్యేలు మరియు కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్న పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని ఝాన్సీ రెడ్డిఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...రుణమాఫీ కార్యక్రమం అమలు చేసేందుకు నిద్రలేని రాత్రులు గడిపామన్నారు. రూపాయి రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టాం అని అన్నారు.ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తాం అని అన్నారు.అర్హులైన అన్ని కుటుంబాలకు రుణమాఫీ చేస్తాం అని అన్నారు. రేషన్ కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ అందిస్తాం అని అన్నారు.కాంగ్రెస్ నాయకులారా రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూత్, ప్రతి ఓటర్ దగ్గరకు కార్యక్రమాన్ని తీసుకెళ్లాలని అన్నారు.తల ఎత్తుకొని ఎక్కడ తగ్గకుండా ప్రచారం చేయండి అని పిలుపునివ్వడం జరిగింది.



# మహనీయుల బాటలో నడుద్దాం : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తొలి అక్షరం/మహబూబ్‌నగర్,జూలై 17: మహనీయుల బాటలో నడుద్దామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పండుగ సాయన్న, ఏకలవ్య జయంతి వేడుకల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఉన్న విగ్రహాలకు బుధవారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డితో కలిసి శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే హన్వాడ మండలకేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఆలో చనతో కేసీఆర్ హయాంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. వారు సమాజం కోసం చేసిన సేవలను నేటి యువత అందిపుచ్చు కోవాలన్నారు. గొప్ప వారిని ఆదర్శంగా తీసుకొని సమాజాభి వృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పండుగ సాయన్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.




# గాయపడిన గీత కార్మికునికి వెంకటనారాయణ చేయూత

**- కృతజ్ఞతలు తెలిపిన కౌండిన్య గౌడ సంఘం మధు గౌడ్**




తొలి అక్షరం/ఇనుగుర్తి,జూలై17: మండల కేంద్రం ఇనుగుర్తి కి చెందిన వేముల చిన్న యాదగిరి మంగళవారం తాటి చెట్టు పై నుంచి పడి తీవ్రగాయాలయ్యాయి.జిల్లా కేంద్రం మానుకోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మండల కేంద్రం ఇనుగుర్తి కి చెందిన వాలీబాల్ భారత మాజీ కెప్టెన్,కౌండిన్య సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు కన్న వెంకటనారాయణ గౌడ్ బుధవారం ఆర్థిక సహాయం చేశారు.ఫోన్పే ద్వారా యాదగిరి కుమారుడు విష్ణుకు రూ.3000 పే చేశారు.ఈ సందర్భంగా కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు కూటికంటి మధు గౌడ్ సంఘం పక్షాన వెంకటనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో ఘనంగా మొహర్రం



తొలి అక్షరం/ఇనుగుర్తి,జూలై17: మండల కేంద్రం ఇనుగుర్తితో పాటు వివిధ గ్రామాలలో బుధవారం మొహర్రం ఘనంగా జరుపుకున్నారు. ఇమామ్ హుస్సేన్ వీరమరణానికి నిదర్శనంగా వారిని స్మరిస్తూ చావడిలో పీ ర్లను తయారు చేసి తొమ్మిది రోజులపాటు పూజించారు. పదవ రోజున తెల్లవారుజామున అగ్నిగుండంలోకి పీర్ల ప్రవేశించి ఊరంతా ఉత్సవం పురస్కరించుకొని నూతన వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసి వీధులలో ఊరేగించారు.డబ్బు చప్పుళ్ళతో వీధుల్లో తిప్పారు.భక్తులు భక్తితో పీర్లకు పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు.సాయంత్రం వేళ ఊరు బయట చెరువులో నిమజ్జనం చేశారు. కాగా చిన్ననాగారంలో బొలగాని యాకయ్య గౌడ్,అంకూస్,భూక్య హుస్సేన్,బాలాజీ నాయక్,లచ్చు నాయక్,మునిగంటి రాజు,నాగేంద్ర చారి,శోభన్ బాబు చారి, గుండాల దుర్గ స్వామి,మేడగోని శ్రీను,గుగులోతు హనుమ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

తొలి అక్షరం/నల్లగొండ,జూలై 17: అక్రమ గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 73.825 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి గుండా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు కొర్లపహాడ్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు.అనుమానస్పదంగా వెళ్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 18,45,625 రూపాయలు ఉంటుందని చెప్పారు. నిందితులు అశోక్ కుమార్, దీపు కుమార్, సుష్మా రాయ్‌ని అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు బారిని పడి యువత భవ్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు.



# నేను భారత్‌లోనూ వంట చేస్తాను.. దుస్తులు ఉతుక్కుంటాను..: ఉనద్కత్



ఇంటర్నెట్ డెస్క్: టీమ్ ఇండియా బౌలర్ జయదేవ్ ఉనద్కత్ సోషల్ మీడియాలో తనపై వస్తున్న ట్రోలింగ్‌పై సమాధానం ఇచ్చాడు. యూకేలో కౌంటి క్రికెట్ ఆడుతున్నప్పుడు వంట చేసుకునే వాడినని, దుస్తులు ఉతుక్కునేవాడినని ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు.దీనిపై ఓ ఎక్స్(ట్విటర్) యూజర్ స్పందిస్తూ.. యూకేలో కారు, ఇల్లు లాంటి విలాసవంతమైన సౌకర్యాలు పొందుతూ.. వాటిని తక్కువ చేస్తూ ఇలా మాట్లాడటం ఏంటని ప్రశ్నించాడు. దీనిపై ఉనద్కత్ వివరణ ఇచ్చాడు. ఇంటర్వ్యూలో తాను చెప్పిన దాంట్లో కొంత భాగాన్నే తీసుకుని అతడు ఇలా విమర్శలు చేశాడని అభ్యంతరం వ్యక్తం చేశాడు.ఆటగాళ్లు తమ పనులను తామే స్వయంగా చేసుకోవాలని చెప్పానని.. ఆ విషయాలను ఆ నెటిజన్ విస్మరించాడని ఉనద్కత్ పేర్కొన్నాడు. ఒకసారి తాను చెప్పిన విషయాలను పూర్తిగా వినాలని కోరాడు. తాను భారత్‌లో ఉన్నప్పుడూ వంట చేసుకుంటానని.. దుస్తులు ఉతుక్కుంటానని వివరించాడు. తాను ఎక్కడ ఆడినా ఆటకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నాడు.ఉనద్కత్ వచ్చే నెల కౌంటీ క్రికెట్‌లో సస్సెక్స్ జట్టుకు ఆడనున్నాడు. గత ఏడాది ఆ జట్టు తరఫున కొన్ని మ్యాచ్‌లు ఆడాడు.

# వాళ్లనే జట్టులో ఎంపిక చేస్తా: గంభీర్



టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత్ మరో పర్యటనకు సిద్ధమైంది. పది రోజుల్లో శ్రీలంక పర్యటన ప్రారంభం కానుంది. లంకతో టీమిండియా మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.మెగాటోర్నీలో గెలిచిన అనంతరం భారత్‌కు ఇది రెండో పర్యటన అయినప్పటికీ.. సీనియర్లు బరిలోకి దిగుతున్న మొదటి సిరీస్ ఇదే. జింబాబ్వే పర్యటనకు శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టు వెళ్లిన విషయం తెలిసిందే.అయితే శ్రీలంక సిరీస్ టీమిండియాకు ఎంతో కీలకం కానుంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ లక్ష్యంగా రోడ్ మ్యాప్‌ను లంక సిరీస్‌తోనే ప్రారంభించనుంది. అంతేగాక నయా కోచ్ గౌతమ్ గంభీర్ ఈ పర్యటనతోనే కోచ్ బాధ్యతలు చేపట్టనుండటంబీ స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా పొట్టిఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో.. లంక పర్యటనకు భారత జట్టు ఎంపికపై అందరిలో ఆసక్తి పెరిగింది.ఈ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ గౌతమ్ గంభీర్ ఓ వీడియోను విడుదల చేసింది. అందులో జట్టు ఎలా ఉండాలో గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఎలాంటి ఆటగాళ్లను తాను కోరుకుంటాడో వివరించాడు. భయం లేని క్రికెటర్లను ఎంపిక చేయడానికి ప్రయత్నిస్తానని చెప్పాడు. జట్టుకు అవసరమయ్యే స్థానాల్లో సహజసిద్ధంగా ఆడేవాళ్లను సెలక్ట్ చేస్తానని గంభీర్ పేర్కొన్నాడు. హిట్టర్లతోనే జట్టు కూర్పును చేయలేమని ఇన్నింగ్స్ ఇరుసులా మారుతూ యాంకరింగ్ బ్యాటింగ్ చేసే వాళ్లు కావాలని తెలిపాడు."భయం లేని ఆటగాళ్లను ఎంచుకోవాలి. అలాగే 50 ఓవర్ల ఫార్మాట్‌కు సరిపోయే ప్లేయర్లను తీసుకోవాలి. యాంకర్ ఇన్నింగ్స్ ఆడే వాళ్లతో పాటు హిట్టర్లతో అన్ని రకాల ఆటగాళ్లు జట్టులో ఉండాలి. రూల్స్ జట్టుకూర్పులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. గంతో ఒకే కొత్త బంతితో ఆడే వాళ్లం. కానీ ఇప్పుడు రెండు కొత్త బంతులు వాడాల్సి ఉంది. అయిదుగురు ఫీల్డర్లు సర్కిల్ లోపలే ఉండాలి. దీంతో పార్ట్ టైమ్ బౌలర్ అవసరం తగ్గిపోయింది""అంతేగాక రివర్స్ స్వింగ్‌ను ఎక్కువగా చూడలేకపోతున్నాం. అలాగే ఫింగర్ స్పిన్నర్ల ఆటను కోల్పోతున్నాం. ఈ పరిస్థితుల్లో తమ బాధ్యతలను సులువుగా అర్థం చేసుకుండా, సహజసిద్ధంగా ఆడే ఆటగాళ్లు జట్టులో ఉండాలని కోరుకుంటున్నాను. అలాంటి 15 మందిని ఎంపిక చేయాలి" అని గౌతమ్ గంభీర్ అన్నాడు. కాగా, శ్రీలంక పర్యటనకు భారత జట్టును రేపటి లోపు ప్రకటించే అవకాశం ఉంది.




# జేమ్స్ ఆండర్సన్ 21 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో అద్భుత క్షణాలు

ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఇటీవల లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టుతో జేమ్స్ రిటైర్మెంట్ ప్రకటించాడు.తన 21 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 188 టెస్టులు ఆడిన అండర్సన్ మొత్తం 704 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.ప్రపంచ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్లలో అండర్సన్ మూడో స్థానంలో ఉన్నాడు. శ్రీలంక స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ 800 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఆసీస్ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ 708 వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరి తర్వాతి స్థానం అండర్సన్‌దే. అయితే, ముత్తయ్య, వార్న్ ఇద్దరూ స్పిన్నర్లే. పేసర్ల పరంగా చూస్తే అండర్సన్‌దే అగ్రస్థానం. ఈ నేపథ్యంలో అతని సుదీర్ఘ కెరీర్‌లో కొన్ని అద్భుత క్షణాలు చూద్దాం..2003, మేలో జింబాబ్వేపై ఆండర్సన్ టెస్ట్ అరంగేట్రం2003 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదర్శన2003లో వన్డేల్లో హ్యాట్రిక్ సాధించిన తొలి ఇంగ్లిష్ ఆటగాడిగా ఘనత2010-11లో ఇంగ్లండ్ యాషెస్ సిరీస్ గెలవడంలో అండర్సన్ కీలక పాత్ర2012లో భారత్ గడ్డపై ఇంగ్లండ్ జట్టు చారిత్రాత్మక సిరీస్ విజయంలార్డ్స్ వేదికగా న్యూజిలాండ్‌పై 300వ టెస్టు వికెట్‌వికెట్ నం.400.. ఈ మైలురాయిని చేరుకున్న మొదటి ఇంగ్లీష్ బౌలర్‌ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా భారత్‌పై అండర్సన్ హాఫ్ సెంచరీ2015 ప్రపంచ కప్ ప్రచారం తర్వాత వన్డేలకు అండర్సన్ దూరం2017లో లార్డ్స్‌లో మరో మైలురాయి.. 500వ టెస్టు వికెట్‌తన సహచరుడు స్టువర్ట్ బ్రాడ్‌తో అండర్సన్2018లో అండర్సన్.. గ్లెన్ మెక్‌గ్రాత్‌ను అధిగమించి టెస్ట్ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన ఫాస్ట్ బౌలర్‌గా ఘనతపాకిస్థాన్ ఆటగాడు అజర్ అలీ.. అండర్సన్‌కి 600వ టెస్టు వికెట్‌భారత్‌పై అండర్సన్ 700వ టెస్ట్ వికెట్ (బ్యాటర్: కుల్‌దీప్ యాదవ్)తన 42వ పుట్టినరోజుకు కొద్ది రోజుల ముందు అంతర్జాతీయ క్రికెట్‌కు అండర్సన్ వీడ్కోలు704 టెస్టు వికెట్లతో కెరీర్ ముగింపు..



# వీరిద్దరూ సచిన్, ధోనీలాంటి వారు.. రీప్లేస్ చేయలేం: కపిల్ దేవ్

ఇంటర్నెట్ డెస్క్: టీ20 ప్రపంచకప్ విజేతగా టీమ్ ఇండియా నిలవగానే.. సీనియర్ ఆటగాళ్లు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించారు.వీరి లేని లోటు జట్టులో స్పష్టంగా కనిపిస్తుందని పలువురు మాజీలు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి మాజీ దిగ్గజం కపిల్ దేవ్ చేరాడు. రోహిత్, కోహ్లిలపై ప్రశంసలు కురిపించాడు."ఏ ఫార్మాట్‌లో అయినా.. రోహిత్, కోహ్లిల స్థానాలను మరొకరితో భర్తీ చేయలేం. భారత క్రికెట్‌కు వారు గొప్ప సేవకులుగా ఉన్నారు. టీ20 ప్రపంచకప్ విజయంతో వీరికి గొప్ప వీడ్కోలు లభించింది. విరాట్ అన్ని ఫార్మాట్లలో ప్రత్యేక ముద్ర వేసుకున్నాడు. కచ్చితంగా అతడిని టీ20ల్లో మిస్ అవుతాం. వీరిద్దరూ టీమ్‌ఇండియాకు సచిన్, ధోనీలాంటివారు. వీరిని రీప్లేస్ చేయలేం" అని కపిల్ పేర్కొన్నాడు.విరాట్ 14 ఏళ్ల టీ20 కెరీర్‌లో మొత్తం 125 మ్యాచ్‌లు ఆడాడు. 4188 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ.. 30 అర్థ శతకాలు ఉన్నాయి. ఇక రోహిత్ 159 టీ20 మ్యాచ్‌ల్లో 4231 పరుగులు చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు ఉన్నాయి. ఇక టీమ్‌ఇండియా పొట్టి ప్రపంచకప్‌ను రెండోసారి గెలవడంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై కపిల్ స్పందించాడు. గంభీర్‌తోపాటు భారత జట్టుకు ఆల్ ది బెస్ట్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశాడు. గతంలో తాము సాధించినదానికంటే వీరు మెరుగ్గా రాణిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నాడు.

# ముంబైలో కొత్త ఇల్లు కొన్న కేఎల్ రాహుల్ దంపతులు..



క్రికెటర్ కేఎల్.రాహుల్, సతీమణి అతియా శెట్టి ముంబైలో నూతన గృహాన్ని కొనుగోలు చేశారు. బాంద్రాలోని పాలిహిల్ ప్రాంతంలోని రూ.20 కోట్లతో ఇల్లు కొనుగోలు చేశారు.సంధు ప్యాలెస్‌లో రెండవ అంతస్తులో 3,350 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఫ్లాట్ కొనుగోలు చేశారు. పత్రాల ప్రకారం వారు రూ.1.20 కోట్ల స్టాంప్ డ్యూటీ కోసం చెల్లించారు.బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి కుమార్తెనే అతియా శెట్టి, క్రికెటర్ కేఎల్ రాహుల్‌ను వివాహం చేసుకుంది. ఇద్దరు కలిసి బాంద్రాలోని పాలి హిల్ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొన్నారు. సంధు ప్యాలెస్ భవనంలోని గ్రౌండ్ ప్లస్‌తో కలిసి మొత్తం 18 అంతస్తుల భవనం. అందులో రెండవ అంతస్తులో 3,350 చదరపు అడుగుల విస్తీర్ణంలో కేఎల్ రాహుల్ ఆస్తి ఉంది. రాహుల్, అతియా శెట్టి పత్రాల ప్రకారం రూ. 1.20 కోట్ల స్టాంప్ డ్యూటీ మరియు రూ. 30,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. ఇక ఈ అపార్ట్‌మెంట్ నాలుగు కార్లు పట్టేంత పార్కింగ్ స్థలం వస్తుంది. ఇంటికి సంబంధించి లావాదేవీలు జూలై 15న జరిగింది.పాలి హిల్‌లో బాలీవుడ్ తారలు, ధనికుల ఇళ్లు ఉంటాయి. బాలీవుడ్ స్టార్ దిలీప్ కుమార్, అమీర్ ఖాన్ నివాసం కూడా ఇక్కడే ఉంది. అలాగే సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, సైఫ్ అలీ ఖాన్, జాన్వీ కపూర్ మరియు త్రిప్తి దిమ్రీ వంటి పలువురు బాలీవుడ్ తారల ఆస్తులు కూడా బాంద్రాలో ఉన్నాయి.

# భారత ఒలింపిక్ బృందంలో అసలు కంటే కొసరే ఎక్కువ!



2024 ఒలింపిక్స్ లో పాల్గొనే 113 మంది అథ్లెట్ల వివరాలను భారత ఒలింపిక్స్ సంఘం అధికారికంగా ప్రకటించింది. భారత బృందంలో అథ్లెట్లను మించి అధికారులు, సహాయక సిబ్బంది ఉండడటం విశేషం.పారిస్ వేదికగా జులై 26 నుంచి ఆగస్టు 11 వరకూ జరిగే 2024 ఒలింపిక్స్ లో భారత్ 113 మంది అథ్లెట్లు, 140 మంది అధికారులు, శిక్షకులు, సహాయక సిబ్బందితో పాల్గోనుంది. భారత బృందం వివరాలను జాతీయ ఒలింపిక్స్ సంఘం అధికారికంగా ప్రకటించింది.**టోక్యో, రియో గేమ్స్ కంటే తక్కువ...**2016 రియో ఒలింపిక్స్ లో 117 మంది అథ్లెట్లతో పాల్గొన్న భారత్..2022 టోక్యో ఒలింపిక్స్ లో మాత్రం 122 మంది సభ్యుల అతిపెద్ద బృందంతో బరిలో నిలిచింది. అంతేకాదు..గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్ ఓ స్వర్ణంతో సహా ఏడు పతకాలు సాధించింది. ఇందులో రెండు రజత, 4 కాంస్యాలు సైతం ఉన్నాయి.ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్ లో మాత్రం భారత అథ్లెట్ల బృందం సంఖ్య 122 నుంచి 113కు తగ్గిపోయింది. వివిధ క్రీడాంశాలలో పాల్గొనటానికి కేవలం 113 మంది అథ్లెట్లు మాత్రమే అర్హత సంపాదించగలిగారు.2016, 2022 ఒలింపిక్స్ తో పోల్చిచూస్తే 2024 ఒలింపిక్స్ లో తక్కువమంది సభ్యుల బృందంతోనే భారత్ తన అదృష్టం పరీక్షించుకోబోతోంది.**సంయుక్త పతాకధారులుగా తెలుగుజోడీ...**ఒలింపిక్స్ ప్రారంభవేడుకల్లో పాల్గొనే భారత బృందానికి తెలుగుజోడీ ఆచంట శరత్ కమల్, పీవీ సింధు సంయుక్త పతాకధారులుగా వ్యవహరిస్తారు. 41 సంవత్సరాల భారత టేబుల్ టెన్నిస్ దిగ్గజం శరత్ కమల్ కు ఇది ఆరవ ఒలింపిక్స్ కాగా...పీవీ సింధుకు మూడో ఒలింపిక్స్ మాత్రమే.**66 మంది పురుషులు, 47 మంది మహిళలు..**పారిస్ గేమ్స్ లో పాల్గొనే 113 మంది సభ్యుల భారత అథ్లెట్ల బృందంలో 66 మంది పురుషులు, 47 మంది మహిళలు ఉన్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో 30 మంది సభ్యులు, షూటింగ్ లో 21 మంది సభ్యులజట్లతో భారత్ పతకాలవేటకు దిగుతోంది.గత ఒలింపిక్స్ హాకీ పురుషుల విభాగంలో కాంస్య పతకం సాధించిన భారత్ 16 మంది సభ్యుల జట్టుతో పోటీకి దిగుతోంది. భారత జట్టుకు పెనాల్టీకార్నర్ స్పెషలిస్ట్ హర్మన్ ప్రీత్ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు.విలువిద్యలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులతో కూడిన జట్టు పతకాలవేటకు దిగుతుంటే..బ్యాడ్మింటన్లో 7, బాక్సింగ్ లో 6, గోల్ఫ్ లో 4గురు సభ్యుల జట్లతో పోటీకి దిగుతున్నారు.అశ్వక్రీడలో పాల్గొనటానికి ఒక్కరు మాత్రమే అర్హత సాధించగలిగారు. జూడో, రోయింగ్ క్రీడల్లో ఒక్కొక్కరు బరిలో నిలువనున్నారు. సెయిలింగ్, ఈత అంశాలలో ఇద్దరు చొప్పున, టెన్నిస్ లో ముగ్గురు, వెయిట్ లిఫ్టింగ్ లో ఒక్కరు, కుస్తీలో ఆరుగురు మాత్రమే భారత్ తరపున పాల్గొనబోతున్నారు.భారత్ ఖచ్చితంగా పతకాలు సాధించే అంశాలలో పురుషుల జావలిన్ త్రో, బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్, హాకీ, కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్ అంశాలు మాత్రమే ఉన్నాయి.ఒలింపిక్స్ లో మొత్తం 32 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహిస్తుంటే..భారత అథ్లెట్లు మాత్రం 14 క్రీడల్లో మాత్రమే పాల్గొనటానికి అర్హత సాధించగలిగారు.**113 అథ్లెట్లకు 140మంది సహాయక సిబ్బంది...**ఒలింపిక్స్ లో 113 అథ్లెట్లు భారత్ తరపున బరిలో నిలుస్తుంటే..వారికి సహాయకులుగా 140 మంది సిబ్బంది పారిస్ బయలు దేరుతున్నారు. వీరిలో జట్టు మేనేజర్లు, వివిధ క్రీడల్లో శిక్షకులు, భారత ఒలింపిక్స్ సంఘం ప్రతినిధులు, వైద్యులు, ఫిజియోలు, వంట సిబ్బంది సైతం ఉన్నారు.సహాయక సిబ్బందిలో 67 మందికి మాత్రమే ఒలింపిక్స్ విలేజ్ లో ఉండేందుకు అనుమతి లభించింది. మిగిలిన వారంతా పారిస్ నగరంలోని హోటెల్ లో బస చేయనున్నారు.భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ బృందానికి 18 మందితో సహాయక బృందం ఉండగా..ఆరుగురు వస్తాదులతో కూడిన కుస్తీ జట్టుకు 18 మంది సహాయకుల బృందం ఉండటం విశేషం.ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్ల శిక్షణ కోసం ' టాప్ ' పథకం కింద భారత ప్రభుత్వం ఇప్పటి వరకూ 18 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.**నజరానాగా 7 కోట్ల రూపాయలు..**2024 ఒలింపిక్స్ లో భారత అథ్లెట్లు తొలిసారిగా రెండంకెల సంఖ్యలో పతకాలు సాధించే అవకాశం ఉందని, పతకవిజేతలకు నజరానాగా 7 కోట్ల రూపాయలు కేటాయించినట్లు..భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ప్రకటించారు.టీమ్ విభాగంలో బంగారు పతకం సాధించిన భారత హాకీజట్టు సభ్యులు..స్వర్ణం సాధిస్తే 2 కోట్ల రూపాయలు నగదు బహుమతిగా అందచేయనున్నారు. రజత పతకం సాధిస్తే కోటి రూపాయలు, కాంస్యం నెగ్గితే 75 లక్షల రూపాయలు చెల్లించనున్నారు.ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్లకు 42 లక్షల ( 50 వేల డాలర్లు ) రూపాయలు చొప్పున ఇస్తామని ఇప్పటికే అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించింది.**రోజుకు 50 డాలర్లు.......**ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్లకు రోజుకు 50 డాలర్లు చొప్పున దినసరి భత్యంగా అందచేయాలని భారత ఒలింపిక్స్ సంఘం నిర్ణయించింది. మొత్తం 195 మంది సభ్యుల కోసం అలవెన్సులను సిద్ధం చేసింది.అథ్లెట్లకు 2 లక్షల రూపాయల నగదు మొత్తాన్ని, కోచింగ్ స్టాఫ్ కు లక్ష రూపాయల చొప్పున గ్రాంట్ ను తొలిసారిగా అందచేసింది. నలుగురు సభ్యుల గోల్ఫ్ బృందానికి అవసరమైన గోల్ఫ్ బ్యాగుల కోసం 4 లక్షల 40వేల రూపాయలు కేటాయించింది. అశ్వక్రీడల కోసం ప్రత్యేకంగా 9 లక్షల రూపాయలు అందుబాటులో ఉంచింది.

## ఈ 6 గురు హీరోలతో సాయి పల్లవి

# ఎందుకు నటించడం లేదు



సాయి పల్లవి..నటించిన అతి తక్కువ సినిమాలతో ఎక్కువ క్రేజ్ సంపాదించుకున్న చాలా తక్కువ మంది హీరోయిన్నలో ఈమె కూడా ఒకరు. పైగా నటించిన చాలా తక్కువ సినిమాలకి ఆమె అందుకున్న అవార్డ్స్ కు సంఖ్య కూడా ఎక్కువే.అలా సాయి పల్లవికి టాలీవుడ్ లోనే కాదు ఫ్యాన్ ఇండియా రేంజ్ లో క్రేజ్ ఉంది. అందుకే ఆమె ఇప్పుడు ప్రస్తుతం నార్త్ రామాయణంలో సీత పాత్రలో నటిస్తుంది. ఇక ఆమెను సుకుమార్ సైతం లేడీ పవర్ స్టార్ అంటూ కొని ఆడడం విశేషం. అలాంటి ఒక కాంప్లిమెంట్ అందుకోవడం హీరోయిన్స్ కి చాలా అరుదు.అయితే సాయి పల్లవి ఇప్పటి వరకు టైర్ 2 హీరోలతోనే ఎక్కువగా నటిస్తూ వస్తుంది. ప్రస్తుతం ఆమె టాలీవుడ్ లో స్టార్ హీరోలుగా ఉన్న ఒక ఆరుగురు హీరోలతో నటించలేదు.మరి ఆమె ఈ ఆరుగురు హీరోలతో మాత్రమే నటించకపోవడానికి గల కారణాలు ఏంటో తెలియదు కానీ ముఖ్యంగా కమిట్మెంట్ వంటి విషయాల జోలికి సాయి పల్లవి వెళ్ళదు. ఆమెకు రీసెంట్గా ఒక టాలీవుడ్ డైరెక్టర్ కమిట్మెంట్ అడిగితే లీగల్ గా యాక్షన్ తీసుకుంటానంటూ వార్నింగ్ కూడా ఇచ్చిందట. సరే ఇది మరొక టాపిక్ కానీ ఇప్పుడు ఆమె రామ్ చరణ్, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్, మహేష్ బాబు లాంటి పాన్ ఇండియా హీరోలతో ఒక్క సినిమా కూడా చేయలేదు.అందుకు కారణాలుగా కొన్ని విషయాలను మనం గమనిస్తే మొదటిది సాయి పల్లవి ఒక హీరోని డామినేట్ చేయగలిగే కెపాసిటీ ఉన్న హీరోయిన్ కావడం కూడా ఆమెకు మైనస్ అని చెప్పొచ్చు.అందుకే ఈ స్టార్ హీరోలు ఆమె క్రేజ్ కి అలాగే డామినేషన్ కి దూరంగా ఉంటున్నారు అనుకోవచ్చు. పైగా లిప్ లాక్స్ లేకుండా ఈ హీరోలు ఒక్క సినిమాలో కూడా నటించడం లేదు. కథ ఇంత డిమాండ్ చేసినా కూడా సాయి పల్లవి లిప్ లాక్స్ ఇవ్వడం, ఎక్స్పోజింగ్ చేయడం వంటివి చేయదు. అందుకోసమే ఆమెను ఈ హీరోలు తమ సినిమాలో పెట్టుకోవడానికి సందేహ పడుతున్నారు.మన ముందు వీరు తేలిపోకూడదు అని కూడా అనుకొని ఉండవచ్చు.

## కుర్రాళ్ల హృదయాల్లో దేవత ఈ అమ్మాయి..


# అందం ఉన్నా అదృష్టమే కలిసిరావట్లే..




తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది హీరోయిన్ మేఘా ఆకాష్. ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీకి అదృష్టమే కలిస రావట్లేదు.ఆడపాదడపా చిత్రాల్లో నటించినా.. ఈ బ్యూటీకి టాలీవుడ్ ఇండస్ట్రీలో అవకాశాలు రావట్లేదు. కానీ ఈ అమ్మడుకు సోషల్ మీడియాలో ఓ రేంజ్ ఫాలోయింగ్ ఉంది. నిత్యం ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోస్, వీడియోస్ క్షణాల్లో వైరలవుతుంటాయి. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది హీరోయిన్ మేఘా ఆకాష్. ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీకి అదృష్టమే కలిసిరావట్లేదు. ఆడపాదడపా చిత్రాల్లో నటించినా.. ఈ బ్యూటీకి టాలీవుడ్ ఇండస్ట్రీలో అవకాశాలు రావట్లేదు.కానీ ఈ అమ్మడుకు సోషల్ మీడియాలో ఓ రేంజ్ ఫాలోయింగ్ ఉంది. నిత్యం ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోస్, వీడియోస్ క్షణాల్లో వైరలవుతుంటాయి. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన క్యూట్ ఫోటోస్ నెట్టింట వైరల్ గా మారాయి. చుడిదార్ లో పద్దతిగా కనిపిస్తూ నెటిజన్లను మంత్రముగ్దులను చేస్తుంది. తెలుగు ప్రేక్షకులకు ఇష్టమైన హీరోయిన్ మేఘా ఆకాష్. ముఖ్యంగా ఈ అమ్మాయికి కుర్రాళ్ల ఫాలోయింగ్ ఎక్కువే. యంగ్ హీరో నితిన్ నటించిన లై తో తెలుగు తెరకు పరిచయమైంది. కానీ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోకపోవడంతో ఈ బ్యూటీకి గుర్తింపు రాలేదు.ఆ తర్వాత ఛల్ మోహన్ రంగ, డియర్ మేఘా, ప్రేమదేశం, రాజ రాజ చోర, గుర్తుందా శీతాకాలం చిత్రాల్లో మెరిసింది. ఇటీవలే రావణాసుర లో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి మెప్పించింది.తెలుగుతోపాటు తమిళంలోనూ పలు చిత్రాల్లో నటించింది. అందం, అభినయంతో మెప్పించినా ఈ బ్యూటీకి తెలుగులో మాత్రం ఆశించి నంతగా అవకాశాలు రావడం లేదు. ఇప్పుడిప్పుడే తమిళంలో కొన్ని లు చేస్తూ బిజీ అవుతుంది మేఘా.


## డిష్యుమ్ డిష్యుమ్ అంటే హీరోలే చేయాలా?

# హీరోయిన్లు చేయకూడదా?









లేడీ అమితాబ్‌లు, లేడీ సూపర్ స్టార్ ఇమేజ్‌లు కావాలంటే డిష్యుమ్ డిష్యుమ్ చేయకపోతే ఎలా? ఈ విషయాన్ని చాలా బాగా అర్థం చేసుకున్నారు మన భామలు. అందుకే మేం కూడా చేయి చేయి కలుపుతాం అంటున్నారు. యాక్షన్ షురూ చేస్తున్నారు. ఆల్ఫా అనే పదం మగవారికే చెందుతుందా? మహిళలకు ఎందుకు అప్లై కాదు.. మేం ఆల్ఫా ఫీమేల్‌ని స్క్రీన్ మీద చూపిస్తాం.డిష్యుమ్ డిష్యుమ్ అంటే హీరోలే చేయాలా? హీరోయిన్లు చేయకూడదా? లేడీ అమితాబ్‌లు, లేడీ సూపర్ స్టార్ ఇమేజ్‌లు కావాలంటే డిష్యుమ్ డిష్యుమ్ చేయకపోతే ఎలా? ఈ విషయాన్ని చాలా బాగా అర్థం చేసుకున్నారు మన భామలు. అందుకే మేం కూడా చేయి చేయి కలుపుతాం అంటున్నారు. యాక్షన్ షురూ చేస్తున్నారు.ఆల్ఫా అనే పదం మగవారికే చెందుతుందా? మహిళలకు ఎందుకు అప్లై కాదు.. మేం ఆల్ఫా ఫీమేల్‌ని స్క్రీన్ మీద చూపిస్తాం. చప్పట్లు కొట్టడానికి మీరు రెడీగా ఉండండి అని అంటున్నారు యష్‌రాజ్ ఫిల్మ్స్ మేకర్స్.ఆలియా, శార్వరి కలిసి స్క్రీన్ మీద చెలరేగిపోవడానికి సిద్ధమవుతున్నారు. ఆల్రెడీ ఆలియా షూటింగ్ స్టార్ట్ అయింది. శార్వరి ఈ లోనే కాదు, వేదాలోనూ శార్వరి యాక్షన్ ఎపిసోడ్స్ కి ఫ్యాన్స్ ఉన్నారు.ఇటు శ్రుతిహాసన్ కూడా డెకాయిట్ లో డిష్యుమ్ డిష్యుమ్ అంటున్నారు. మాజీ ప్రేమికులిద్దరూ చేతుల్లో వెపన్స్ తో కనిపించే టీజర్ మీద అంచనాలు పెంచేస్తోంది. ఆల్రెడీ క్రాక్‌లోనూ బిగ్ ఫైట్ చేశారు శ్రుతిహాసన్. వాల్తేరు వీరయ్యలోనూ ఆమె వెపన్స్ ని డీల్ చేశారు.ఫైట్స్ చేయడంలో ఇప్పుడిప్పుడే ట్రైనింగ్ తీసుకుంటున్నవారికి ఇన్‌స్పిరేషన్‌గా ఉన్నారు సమంత. ఆల్రెడీ ఆమె ఫ్యామిలీమేన్2లో యాక్షన్ సీక్వెన్స్ ఇరగదీశారు. గర్భవతిగా కనిపిస్తూనే యశోదలో యాక్షన్ సీక్వెన్స్ చేశారు. త్వరలో రిలీజ్‌కి రెడీ అవుతున్న సిటాడెల్‌లోనూ సామ్ యాక్షన్‌ని చూడొచ్చు.త్రిష ఓటీటీలో డెబ్యూ ఇస్తున్న సీరీస్ బృంద. చెడు మీద మంచి చేసే యుద్ధంగా కనిపిస్తోంది బృంద. ఇందులో ఖాకీ డ్రస్‌లో పక్కా యాక్షన్ రోల్ చేశారు త్రిష. ఇంతకుముందు కొన్ని ల్లో యాక్షన్ సీక్వెన్స్ చేసినప్పటికీ ఈ సీరీస్ మాత్రం తనకు చాలా స్పెషల్ అని అంటున్నారు ఈ చెన్నై సుందరి.





## ఆందోళన చెందొద్దు.. అప్పుడు అన్ని వివరాలు చెబుతా: ఆర్ నారాయణ మూర్తి

విప్లవ చిత్రాల దర్శకుడు, నటుడు ఆర్.నారాయణ మూర్తి ఆరోగ్యంపై సోషల్ మీడియాలో రూమర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఆయన నిమ్స్ ఆసుపత్రిలో చేరడంతో ఒక్కసారిగా ఊహాగానాలు వ్యాప్తి చెందాయి.పీపుల్స్ స్టార్ నారాయణ మూర్తికి ఏమైందంటూ ఆయన అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నారాయణ మూర్తి స్పందించారు. తన ఆరోగ్యంపై అభిమానులు ఆందోళన చెందవద్దంటూ వెల్లడించారు.**అన్ని వివరాలు చెబుతా..** తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ ఆర్.నారాయణ మూర్తి తెలిపారు. అభిమానులు ఎవరూ ఆందోళన చెందవద్దంటూ ఓ ప్రకటనలో వెల్లడించారు. తాను పూర్తిగా కోలుకున్నాక ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తి వివరాలు తెలియజేస్తానని ఆయన పేర్కొన్నారు.తాను నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నానని, దేవుడి దయవల్ల బాగా కోలుకుంటున్నానని ఆర్.నారాయణ మూర్తి వెల్లడించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. నారాయణ మూర్తి ప్రకటనతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.**ఏం జరిగింది?...** పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి నేడు హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో బయటికి వచ్చాయి. డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో ఆయన చికిత్స తీసుకుంటున్నట్టుగా సమాచారం బయటికి వచ్చింది.దీంతో నారాయణ మూర్తి ఆసుపత్రిలో ఎందుకు చేరారంటూ ఆందోళన మొదలైంది. దీనికి తోడు సోషల్ మీడియాలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై కొన్ని రూమర్లు వ్యాప్తి చెందాయి. ఇవి కాస్త ఎక్కువవయ్యాయి. దీంతో నారాయణ మూర్తి స్పందించి.. ఆందోళన చెందవద్దని వివరించారు. దీంతో రూమర్లకు చెక్ పడింది.నారాయణ మూర్తి గతంలో బైపాస్ సర్జరీ చేయించుకున్నారని సమాచారం. సాధారణ టెస్టుల్లో భాగంగానే ఆయన ఇప్పుడు ఆసుపత్రికి వెళ్లారని తెలుస్తోంది.**విప్లవ చిత్రాలతో పీపుల్స్ స్టార్‌గా..** ఆర్.నారాయణ మూర్తి విప్లవ చిత్రాలను తెరకెక్కించి ప్రజల గళంగా నిలిచారు. దర్శకత్వంతో పాటు ప్రధాన పాత్రల్లో నటించారు. పీపుల్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. దండోర, ఎర్రసముద్రం, ఒరేయ్ రిక్షా, దండకారాణ్యం సహా చాలా చిత్రాలను ఆయన చేశారు. సుమారు 40కు పైగా చిత్రాలను ఆర్.నారాయణ మూర్తి చేశారు. ఒకప్పుడు వరుసగా సినిమాలు చేసిన ఆయన.. కొంతకాలంగా అంత యాక్టివ్?గా లేరు. చివరగా 2021లో రైతన్న చిత్రం చేశారు నారాయణ మూర్తి. ఎన్ని సినిమాలు చేసినా ఆయన సింప్లిసిటీతోనే ముందుకు సాగారు. కమర్షియల్ సినిమాల్లో అవకాశాలు వచ్చినా నారాయణ మూర్తి సున్నితంగానే తిరస్కరించారు. తాను నమ్మిన సిద్ధాంతాలనే కొనసాగిస్తున్నారు.టాలీవుడ్ సమస్యలపై కూడా పలుసార్లు నారాయణ మూర్తి గళమెత్తారు. సినీ ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలకు కూడా వివరించారు.